సాక్షి మహబూబాబాద్

మంగళవారం । 21 । మార్చి । 2023



టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి
తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అన్నారు.
- 8లో▸



ప్రభుత్వ ఖజానాకు టోకరా..
నకిలీ వే బిల్లులు సృష్టించి ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు గండికొట్టిన ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు వరంగల్ సీపీ తెలిపారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
32.7°/19.0°
వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నమ్మకం పెరిగేలా విధులు నిర్వర్తించాలి



మహబూబాబాద్ రూరల్: పోలీస్ వ్యవస్థపై బాధిత ప్రజలకు నమ్మకం పెరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం మానుకోటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ వినతులు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఫోన్ ద్వారా సంబంధిత అధికారులకు సిఫారసు చేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

మున్నేరు వాగుకు జలకళ



దోర్నకల్: భారీ వర్షాలు కురవడంతో మున్నేరు వాగు నిండుగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడడంతో మున్నేరుకు వరద పెరిగింది. వేసవికాలం కావడంతో మున్నేరులో నీరు అడుగంటుతున్న క్రమంలో వర్షాలతో వాగు నిండుగా ప్రవహిస్తుండడంతో స్థానికులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంటలను పరిశీలించిన ఆర్డీఓ



గూడూరు: మండలంలో వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, వరి, మిర్చి తదితర పంటలను సోమవారం ఆర్డీఓ కొమురయ్య పరిశీలించారు. మండలంలోని చిన్న ఎల్లాపురంలో నేలవాలిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో దెబ్బతిన్న పంటల సర్వే చేసి వివరాల నివేదిక అందించాలని తహసీల్దార్ అశోక్‌కుమార్, ఏఓ రాకేష్‌కు సూచించారు. ఎంపీడీఓ రోజారాణి, సర్పంచ్ బాలూనాయక్, రైతులు రైతులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన సదస్సు



నెహ్రూసెంటర్: జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై వైద్యాధికారులు, టీబీ నోడల్ సూపర్‌వైజర్లకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విశాల్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మురళీధర్ మాట్లాడుతూ.. టీబీ అనేది అంటువ్యాధి అని, బ్యాక్టీరియా ద్వారా సంక్రమిస్తుందని తెలిపారు. సరైన సమయంలో మందులు వాడడం వల్ల వ్యాధిని నయం చేయవచ్చన్నారు. క్షయవ్యాధిగ్రస్తులు ప్రొటీన్లతో కూడిన పోషకాహారం తీసుకోవాలని, ప్రభుత్వం టీబీ రోగులకు పోషకాహారం నిమిత్తం డీబీటీ పథకం ద్వారా ప్రతి నెల రూ. 500 చొప్పున ఆరు నెలల పాటు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మీడియా ఇన్‌చార్జ్ కేవీ రాజు, టీబీ కోఆర్డినేటర్ వెంకట్, ఆర్గనైజర్లు భాస్కర్, అశోక్, శ్రీధర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణ, అర్జున్‌రావు, హెచ్‌ఈఓ రామకృష్ణ, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



మహబూబాబాద్ అర్బన్: యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్ బుచ్చయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రాంగణంలో ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలకు ఐదు రోజుల యోగా శిక్షణను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బుచ్చయ్య మాట్లాడుతూ.. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు యోగా శిక్షణను సద్వినియోగం చేసుకొని, విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించాలన్నారు. పీడీలు, పీఈటీలు, శంకర్‌నాయక్, చాంప్లానాయక్, పుష్పలీలా, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రాజకుమారి, ప్రవీణ్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జ్యోతి, ఉపాధ్యాయులు వాసుదేవ్ పాల్గొన్నారు.

కన్నీళ్లు మిగిల్చిన వాన

- 24,626 ఎకరాల్లో పంట నష్టం అంచనా
- 12 ట్రాన్స్‌ఫార్మర్లు, 230 విద్యుత్ స్తంభాల ధ్వంసం
- రూ. 20కోట్ల మేర నష్టం
- రెండు రోజులుగా అంధకారంలో పలు గ్రామాలు
- పరిహారం చెల్లించాలని రైతుల వినతి



నేలవాలిన మొక్కజొన్న పంట

సాక్షి, మహబూబాబాద్: జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి, ఆదివారం ఉదయం కురిసిన వడగండ్ల వాన రైతులకు కన్నీళ్లు మిగిల్చింది. ఆరుగాలం కష్టించి రైతులు కాపాడుకుంటున్న పంటలు నీటిపాలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 24,626 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనా. దీనికి తోడు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోయాయి. మరికొన్ని కాలిపోయాయి. అలాగే పలు ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా అకాల వర్షంతో రూ.20కోట్ల మేరకు నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే అంచనాకు మించి నష్టం ఉంటుందని రైతులు, రైతు సంఘాల నాయకులు అంటున్నారు.

అధికారుల అంచనా..

జిల్లాలో కురిసిన వడగండ్ల వానతో పంట, ఆస్తి నష్టాన్ని అంచనా వేయాలని కలెక్టర్ శశాంక వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్, పంచాయతీరాజ్‌శాఖల అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం జిల్లాలో పర్యటించిన అధికారులు పంట నష్టంపై అంచనా వేసి నివేదికలను ఉన్నతాధికారులకు అందించారు. ఈ లెక్కల ప్రకారం జిల్లాలో 18 మండలాల్లోని 158గ్రామ పంచాయతీల్లో నష్టం వాటిల్లింది. 9,138 మంది రైతుల పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానంగా 11,531ఎకరాల్లో మొక్కజొన్న, 4,958ఎకరాల్లో వరి, 3,705ఎకరాల్లో మామిడి, 820ఎకరాల్లో మిర్చి, 89ఎకరాల్లో పుచ్చ, 12 ఎకరాల్లో బొప్పాయితో పాటు 165ఎకరాల్లో పొద్దుతిరుగుడు, కూరగాయలు, ఇతర పంటలు దెబ్బతిన్నాయి. మొత్తంగా రూ12.5కోట్ల పంట నష్టం జరిగినట్ల అధికారులు అంచనా వేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం..

ఈదురుగాలులు, రాళ్లతో కూడిన అకాలవర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయ ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా 12 ట్రాన్స్‌ఫార్మర్లు కూలిపోవడం, కాలిపోవడం, 250 మేరకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కొన్నిచోట్ల వంగిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో 30 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాగా ఆదివారం, సోమవారం విద్యుత్ అధికారులు శ్రమించడంతో చాలా చోట్ల విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అత్యధికంగా నష్టం జరిగిన మహబూబాబాద్, గూడూరు, కొత్తగూడ, డోర్నకల్, దంతాలపల్లి, గార్ల మండలాల్లోని ఏడు గ్రామాలకు సోమవారం సాయంత్రం వరకు శ్రమిస్తే కానీ విద్యుత్ సరఫరా కాలేదని, మరికొన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని ఆశాఖ అధికారులు చెబుతున్నారు.

పంటల పరిశీలన..

వడగండ్ల వానతో పంట నష్టం జరిగిన ప్రాంతాలను అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పరిశీలించారు. ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, రెడ్యానాయక్ పంటలను పరిశీలించి ప్రభుత్వం ద్వారా పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు క్షేత్ర పర్యటన చేసి పంటనష్టం అంచనా నివేదికను అందజేశారు. అదేవిధంగా కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ నాయకులు పంట నష్టం జరిగిన రైతుల వద్దకు వెళ్లి ఓదార్చారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నాయకులు, రైతు సంఘాల నేతలు మాట్లాడుతూ.. అధికారుల అంచనాకు మించి నష్టం జరిగిందని అన్నారు. జిల్లాలో రూ. 20కోట్లకు పైగా పంట, ఆస్తినష్టం జరిగిందని చెప్పారు. రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆస్తుల జప్తు!

- ఇంటి పన్ను చెల్లించకుంటే సామగ్రి తీసుకెళ్తున్న అధికారులు
- మానుకోట మున్సిపాలిటీలో వందశాతం వసూళ్లే లక్ష్యం
- బకాయిదారుల్లో తీవ్ర ఉత్కంఠ
- సుమారు 500మందికి రెడ్ నోటీసులు

మహబూబాబాద్: జిల్లాలో వందశాత పన్నుల వసూళ్లపై అధికారులు దృష్టి పెట్టారు. పదో పది రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో వసూళ్లలో వేగం పెంచారు. మున్సిపాలిటీలతో పాటు జీపీల్లో ఇంటి యజమానుల ముక్కుపిండి మరీ పన్నులు సేకరిస్తున్నారు. కాగా మానుకోట మున్సిపాలిటీలో ఒక అడుగు ముందుకేసి ఆస్తులు జప్తు చేస్తున్నారు. ఇంటి తలుపులు, ఇతర సామగ్రిని తీసుకెళ్తున్నారు. దీంతో మున్సిపల్ పరిధిలోని బకాయిదారుల్లో ఉత్కంఠ నెలకొంది.

82శాతం వసూలు..

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు 82శాతం పన్నులు వసూళ్లు చేశారు. కాగా బిల్ కలెక్టర్ శ్రీనివాస్, మేనేజర్ శ్రీధర్, ఆర్ఓ స్వామి, ఆర్ఐ కిషోర్, అకౌంటెంట్ కుమార్, పర్యావరణ అధికారి క్రాంతితో పాటు పలువురు సిబ్బందితో టీం ఏర్పాటు చేశారు. వారు బకాయిదారుల ఇంటికి వెళ్లి పన్నులు వసూళ్లు చేస్తున్నారు. ఒక వేళ పన్నులు చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేస్తున్నారు. కాగా 36వ వార్డుకు చెందిన జానీమహ్మద్ 2018 నుంచి ఇప్పటి వరకు ఇంటి పన్ను రూ.9,778, నల్లా పన్ను రూ.7,200 మొత్తంగా రూ.16,978 బకాయిపడ్డాడు. అయితే ఆ మొత్తం చెల్లించాలని అధికారులు సోమవారం సూచించారు. జానీమహ్మద్‌తో పాటు అతడి కుమారుడు జావెద్ సాయంత్రం వరకు చెల్లిస్తామని ప్రాధేయపడినా మొదట అధికారులు కనికరించలేదు. సిబ్బందితో ఇంటి తలుపులు తొలగించి మున్సిపల్ ట్రాక్టర్‌లో వేశారు. ఈ క్రమంలో కుటుంబసభ్యులు అధికారులను సుమారు గంటకుపైగా ప్రాధేయపడడంతో తలుపులు ఇచ్చారు. ఈ ఈనెల 21వ తేదీ వరకు పన్నులు చెల్లించకుంటే మళ్లీ వచ్చి ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు.



తలుపులు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రెడ్ నోటీసులు..

మానుకోట మున్సిపల్ పరిధిలో సుమారు 500 మంది ఇంటి యజమానులకు రెడ్ నోటీసులు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ముందుగా నోటీసులు ఇచ్చామని.. అయినా స్పందించకుంటే రెడ్ నోటీసులు ఇచ్చామని అందుకు స్పందించకుంటే ఆస్తులు జప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీ వరకు 82శాతం పన్నులు వసూళ్లు అయ్యాయని, నల్లా పన్ను చెల్లించకుంటే కనెక్షన్ తొలగిస్తామని చెప్పారు.

సీడీఎంఏ కమిషనర్ ఆదేశాలతోనే..

సీడీఎంఏ కమిషనర్ ఆదేశాలతోనే తగిన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. వంద శాతం పన్నులు వసూళ్లు చేయకపోతే పలు గ్రాంట్ల నిధులు నిలిపివేస్తామని ఆదేశాలు రావడం వల్లే ఆస్తులు జప్తు చేస్తున్నామన్నారు.

వంద శాతం వసూళ్లు చేయాలి

వంద శాతం పన్నులు వసూళ్లు చేయాలని ఆదేశాలు వచ్చాయి. అందుకు బకాయిదారుల ఇంటికి వెళ్లి పన్ను చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేస్తున్నాం. మానుకోట మున్సిపాలిటీలో ఇంటి బకాయి కేవలం రూ.36లక్షలే ఉంది. అంతా వసూళ్లు చేస్తే వందశాతం పూర్తి అవుతుంది.

-శ్రీధర్, మానుకోట మున్సిపల్ మేనేజర్

అభ్యర్థులకు పరిహారం చెల్లించాలి

మహబూబాబాద్ అర్బన్: టీఎస్‌పీఎస్సీ పరీక్షలు రాసిన ఒక్కో అభ్యర్థికి రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష చొప్పున పరిహారం ప్రకటించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు నిరుద్యోగుల మీద చిత్తశుద్ధి ఉంటే పేపర్ లీకేజీలో హస్తం ఉన్నవారి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. లీకేజీ వ్యవహారంలో మంత్రి కేటీఆర్‌ను బాధ్యుడిని చేస్తూ బర్తరఫ్ చేయాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగం కోసం చదువుతున్న అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోత్ మదన్‌నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌పై అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన వ్యవస్థపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల మోర్చా అధ్యక్షులు రాంబాబు నాయక్, ఇందు భారతి, సిరికొండ సంపత్, జిల్లా కోశాధికారి శ్యామ్‌సుందర్ శర్మ, నాయకులు నర్సింహరెడ్డి, పద్మ, రేష్మా, కవిత, పల్లె సందీప్, మల్లం యశ్వంత్, పసుపులేటి నవీన్ నాయుడు, వెంకట్‌రెడ్డి, మాలిక్, రంజిత్, వెంకన్న, రాజ్‌కుమార్, సుందర్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కేసముద్రం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, నియోజకవర్గ నాయకుడు మురళీనాయక్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం మండలంలోని కేసముద్రంవిలేజ్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల ముందు బీఆర్‌ఎస్, బీజేపీ తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను మోసగించాయన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వైపే ప్రజలు చూస్తున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న మొక్కజొన్న, మిర్చి పంటలను వారు సందర్శించారు. మొక్కజొన్న ఎకరాకు రూ.30 వేలు, మిర్చి పంటకు రూ.40వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు మాసాడి శ్రీనివాస్, బైరు వెంకన్న, సదానందం, గంధసిరి శ్రావణ్‌కుమార్, చిర్రగాని సారయ్య, కూరెల్లి సతీష్, మహేష్, సారంగం, కత్తెరశాల శ్రీనివాస్, బుర్ర ధర్మారెడ్డి, లక్కాకుల సత్యనారాయణ, సురేందర్, సంజీవరెడ్డి, గుండు గోపాల్ పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

వివరాలు అందజేయాలి

మహబూబాబాద్ రూరల్: అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలు అందజేయాలని జిల్లా వ్యవసాయ అధికారి భూక్యా ఛత్రునాయక్ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని పర్వతగిరి గ్రామంలో వర్షానికి నష్టపోయిన పంటలను డీఏఓ ఛత్రునాయక్, ఏడీఏ లక్ష్మీనారాయణ, ఏఓ తిరుపతిరెడ్డి సందర్శించి పరిశీలించారు. రైతులకు సూచనలు ఇచ్చి పంటల రక్షణ, ఇతర విషయాలపై అవగాహన కల్పించారు. దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించి ప్రభుత్వం, కలెక్టర్‌కు నివేదిక రూపంలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇనుగుర్తి శ్యాంకుమార్, ఎంపీటీసీ భూక్యా రామచందర్, రైతు ఆకుతోట నర్సయ్య, ఏఈఓ రాజ్యలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

కేసముద్రంలో..

కేసముద్రం: మండలంలోని వెంకటగిరి, భుక్యారాం తండా శివారు కాలనీతండాలో వర్షాలతో దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను డీఏఓ ఛత్రునాయక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాలవర్షంతో పంటలు దెబ్బతిన్న రైతులు ఎవరూ అధైర్యపడొద్దన్నారు. త్వరలోనే సర్వే చేసి పంటల నష్టం వివరాల నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫరీద్, ఎంపీడీఓ రవీందర్‌రావు, ఏఓ వెంకన్న, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యానారాయణరావు, ఏఈఓలు రవివర్మ, సుమన్ పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏఓ ఛత్రునాయక్, అధికారులు

ఫణికాంత్‌కు యంగ్ సైంటిస్ట్ అవార్డు

కేయూ క్యాంపస్: తెలంగాణ అకాడమీ సైన్సెస్(టాస్) కాకతీయ యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగంలో పోస్టు డాక్టర్ ఫెల్లోగా పరిశోధనలు చేస్తున్న డాక్టర్ జె.ఫణికాంత్‌ను యంగ్ సైంటిస్టు అవార్డుకు ఎంపిక చేసింది. బయోటెక్నాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏవీ రావు పర్యవేక్షణలో పోస్టు డాక్టర్ ఫెల్లోగా(పీడీఎఫ్) చేస్తున్నారు. కాగా.. యంగ్ సైంటిస్టు అవార్డుకు ఎంపిక కావడం పట్ల పలువురు ఫణికాంత్‌ను అభినందించారు. త్వరలోనే హైదరాబాద్‌లో తెలంగాణ అకాడమీ సైన్సెస్ వారు అవార్డును ప్రదానం చేయనున్నారు.

సత్వర పరిష్కారానికే ప్రజావాణి

- కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, ట్రైనీ కలెక్టర్ పింకేశ్‌కుమార్ వినతులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్ వినతులను కూడా త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 70 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

వినతులు కొన్ని..

- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు దార్ల శివరాజ్ కలెక్టర్ శశాంకకు వినతి పత్రం అందజేశారు.
- ఎస్సీ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని, వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు కలెక్టర్‌కు వినతి అందజేశారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, ట్రైనీ కలెక్టర్

గాంధీపురం రైతులకు న్యాయం చేయాలి

ఎంపీ మాలోత్ కవిత సోమవారం రైతుల పక్షాన కలెక్టరేట్‌కు వచ్చి ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మానుకోట మున్సిపాలిటీ పరిధి గాంధీపురం గ్రామానికి చెందిన రైతులకు 180ఎకరాల భూమికి సబంధించిన పాస్‌పుస్తకాలు ఇవ్వాలని, రైతుబంధు, రైతుబీమా అమలయ్యే విధంగా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఆ భూములకు సంబంధించిన అన్ని పత్రాలను కలెక్టర్‌కు ఇచ్చి రైతుల సమస్యలను వివరించారు. అలాగే కురవి దేవాలయానికి సంబంధించిన 3.09 ఎకరాల భూమి విషయంలో హద్దులు కేటాయిస్తే ఆభూమిలో సత్రాల నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. ఆభూమి విషయంలో కూడా సర్వే చేయాలని కోరారు. ఎంపీ వెంట పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ముత్యం వెంకన్న, యుగేందర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



గాంధీపురం రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వివరిస్తున్న ఎంపీ కవిత

ఒకటిన జీతాలు చెల్లించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

మహబూబాబాద్ అర్బన్: కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు జీతాల కోసం కూడా ఉద్యమించాల్సిన దుస్థితి ఏర్పడిందని, సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం అన్నారు. జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో సోమవారం కలెక్టరేట్ ముట్టడి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం శ్రీశైలం మాట్లాడుతూ.. ఆర్థికశాఖ ఆధ్వర్యంలోని ఈ కుబేరులో నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను సత్వరమే చెల్లించాలన్నారు. ఆర్థిక అవసరాల కోసం సెలవులు సరెండర్ చేసి నగదు మార్చుకునే బిల్లులు మంజూరు కావడానికి సంవత్సరం పొడవునా ఎదురుచూసే దుస్థితిని తొలగించాలన్నారు. ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24వ తేదీన కలెక్టరేట్ ఎదుట చేపట్టే నిరసనను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.విష్ణువర్ధన్, నాయకులు రాజు, కార్తీక్, శ్రీనివాస్, రఫీ, బాలచందర్, ప్రకాశం, నరేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డుగ్రహీతలకు అభినందన

మహబూబాబాద్ రూరల్: రాష్ట్రస్థాయిలో పురస్కారాలు అందుకున్న మహిళా పోలీసు అధికారి, ఇద్దరు సిబ్బందిని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సోమవారం అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫంక్షనల్ వర్టికల్స్‌లో ఉత్తమ పనితీరు కనబర్చిన సిబ్బంది, అధికారులకు ఇటీవల డీజీపీ అంజనీకుమార్ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఈ మేరకు పురస్కారాలు అందుకున్న ఏఎస్సై శోభారాణి, కానిస్టేబుళ్లు అనితారాణి, నాగమణిని సోమవారం మానుకోట ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అభినందించారు.

పంటల నష్టంపై నివేదిక ఇవ్వాలి

- కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాల నివేదికను తక్షణమే అందజేయాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పంటల నష్టంపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అకాల వర్షాలకు పంటలు, ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. విద్యుత్ స్తంభాలు, చెట్లు కూలిపోయానని, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని తొర్రూరు, దంతాలపల్లి, పెద్దవంగర, నెల్లికుదురు, కేసముద్రం, గూడూరు తదితర మండలాల్లో పంటనష్టం వివరాలు ఇవ్వాలని సూచించారు. అలాగే గూడూరులో ప్రాణనష్టం, పెద్దవంగర మండలంలో మృతిచెందిన పాడి పశువుల వివరాలు అందజేయాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది సమగ్ర సమాచారంతో నివేదికలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, ఆర్డీఓలు కొమురయ్య, రమేష్ పాల్గొన్నారు.



ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి వీవీ ప్యాడ్‌ల తరలింపుపై సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

వీవీ ప్యాడ్‌లను పకడ్బందీగా తరలించాలి..

వీవీ ప్యాడ్‌లను పకడ్బందీగా తరలించాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. సోమవారం ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. ఎన్నికల విభాగం తహసీల్దార్ అనురాధ, తహసీల్దార్ నాగభవాణి, అధికారులు పాల్గొన్నారు.

నక్క.. బతికిపోయింది..

పొరపాటున బావిలో పడిన నక్కను ఓ జంతుప్రేమికురాలు, రైతులు కలిసి బయటికి తీసి అడవిలో వదిలారు. మహబూబాబాద్ మండలం గుడ్డిగూడెంతండాకు చెందిన భూక్యా విష్ణు వ్యవసాయ బావిలో ఆదివారం రాత్రి ఓ నక్కన పడిపోయింది. సోమవారం ఉదయం గమనించిన రైతు దానిని కాపాడే మార్గం తెలియక.. గ్రామపంచాయతీ, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. అయినా స్పందించకపోవడంతో జంతుప్రేమికురాలు, 'నేను సైతం' సంస్థ సభ్యురాలు మహ్మద్ సుమకు సమాచారం ఇవ్వగా ఆమె బావి వద్దకు చేరుకున్నారు. రైతుల సాయంతో బావిలోకి తాడు వేసి నక్కను బయటికి తీశారు. ఆ తరువాత అడవిలో వదిలారు. బతుకు జీవుడా అంటూ నక్క పరుగులక్కించుకుంది.

– మహబూబాబాద్ రూరల్



తాడుతో పైకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తూ..,



పైకి లాగుతూ..,



నక్కను పరిశీలిస్తూ..



అడవిలో వదిలేస్తున్న సుమ

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


ముళ్లపొదల్లో కృష్ణ మృతదేహం

కాజీపేట అర్బన్: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి పడడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన కాజీపేట మండలం అమ్మవారిపేటలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మడికొండ ఎస్సై నర్సింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేటలోని రాయపర్తి మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన బొజ్యన కృష్ణ (36) మహబూబాబాద్ జిల్లాలోని కురవి మండలం బీబీనగర్ తండాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. తన భార్య రాధిక స్వగ్రామం మడికొండకు ఇటీవల తమ సమీప బంధువులు మృతి చెందగా వచ్చాడు. ఆదివారం రంగశాయిపేటలోని బంధువులను కలిసేందుకు తన ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి మడికొండకు వస్తున్న క్రమంలో అమ్మవారిపేటకు రాగానే బైక్ అదుపుతప్పి ముళ్లపొదల్లో పడిపోయాడు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేయడంతో ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడి భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిని తండ్రి వేధిస్తున్నాడని కుమారుడి ఆత్మహత్య


బర్ల శ్రీకాంత్(ఫైల్)

గీసుకొండ: తండ్రి తరచుగా మద్యం సేవించి ఇంటికి వచ్చి తన తల్లితో గొడవపడుతూ వేధిస్తుండటంతో మనస్తాపం చెందిన యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారానికి చెందిన బర్ల శ్రీనివాస్, స్వరూప దంపతులకు కూతురు, కుమారుడు ఉండగా కూతురు వివాహం జరిగింది. కుమారుడు బర్ల శ్రీకాంత్(27) డిగ్రీ వరకు చదువుకుని ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. తండ్రి కూలీ పనికి వెళ్లి తరచుగా తాగి వచ్చి తన తల్లి స్వరూపను తిడుతూ.. కొడుడూ ఉండేవాడు. ఆదివారం రాత్రి కూడా తండ్రి తాగివచ్చి తన తల్లితో గొడవ పడటంతో శ్రీకాంత్ ఆమెను ధర్మారంలోని బంధువుల ఇంటికి పంపించాడు. తిరిగి తన ఇంటికి వెళ్లి గది తలుపులు మూసి ఇంటిలోని దూలానికి ఉరి వేసుకున్నాడు. సోమవారం ఉదయం అతడి తల్లి వచ్చి కిటికీలో నుంచి చూడగా అప్పటికే దూలానికి వేలాడుతూ మృతి చెంది ఉన్నాడని మృతుడి బంధువులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు తెలిపారు.

ప్రభుత్వ ఖజానాకు టోకరా..

- నకిలీ వే బిల్లులతో ఇసుక రవాణా
- పోలీసులకు చిక్కిన ముఠా
- ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం
- విలేకరుల సమావేశంలో సీపీ రంగనాథ్


మాట్లాడుతున్న సీపీ రంగనాథ్, పక్కన అధికారులు

వరంగల్ క్రైం : నకిలీ వే బిల్లులు సృష్టించి ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయలు గండికొట్టిన ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ తెలిపారు. సోమవారం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రంగనాథ్ మాట్లాడారు. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా, బిల్లులు ఎలాంటి తేడాలు కనిపించకుండా నకిలీలు సృష్టించి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న 10 మంది ముఠా సభ్యులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితులు యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ మండలం పుట్టపాక గ్రామానికి చెందిన ఏదుల కిరణ్, ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్, హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన గంట ప్రదీప్‌రెడ్డి, భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మంచెళ్ల వెంకటేశ్, ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన పర్లపల్లి శ్రీకాంత్, ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి చెందిన రాజశేఖర్ గౌడ్, యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం సాయిగోన్ బావికి చెందిన బండమిద్ది స్వామి, అరుట్ల రాజు, రంగారెడ్డి జిల్లా మంచెల్ మండలం లోయపల్లి గ్రామానికి చెందిన బూడిద శివ, నల్గొండ జిల్లా దిండి మండలం గౌరారం గ్రామానికి చెందిన జోగు సైదులులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి చెందిన చరణ్‌గౌడ్, ఏటూరునాగారం మండలం ఆకులవారి ఘన్‌పూర్‌కు చెందిన యనమళ్ల రాకేష్, ఆత్మకూరు మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన ముత్యాల రామన్న, యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం వావిలాళ్లపల్లికి చెందిన బచనగోని యాదగిరిలు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. నిందితుల నుంచి 65 నకిలీ వే బిల్లులు, టీఎస్ఎండీసీ 16 స్టాంప్‌లు, 16 లారీలు, 11 సెల్‌ఫోన్‌లు, 1 ల్యాప్‌లాప్, రూ.41వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆదాయానికి గండి

ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం చెల్లించకుండా నిందితుల కంప్యూటర్ ద్వారా ఈ ముఠా ఇప్పటికి సుమారు 1,700 వే బిల్లులు సృష్టించి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని పేర్కొన్నారు. ఈ ముఠా సభ్యుల్లో లారీ ఓనర్ల పై కూడా కేసులు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వానికి ఇసుక లోడింగ్ కోసం 12 టైర్ల లారీ ఓనర్లు రూ.10,238, 14 టైర్ల ఓనర్లు రూ.13,085 , 16 టైర్ల ఓనర్లు రూ.14,800 చెల్లించి డీడీలను టీఎస్ఎండీసీకి చెల్లించి ఇసుక లోడింగ్ చేసుకుంటారని, అలా కాకుండా కంప్యూటర్ పై అవగాహన ఉన్న ఏదుల కిరణ్‌కుమార్ నకిలీ వే బిల్లులను క్యూఆర్ కోడ్‌తో సహా సృష్టించి ప్రభుత్వానికి ఆదాయం రాకుండా చేసారని సీపీ తెలిపారు. కొంతమంది దళారులను ఏర్పాటు చేసుకొని లారీ ఓనర్లతో నేరుగా సంబంధాలను ఏర్పాటు చేసుకొని గత కొంతకాలంగా ఈ ముఠా రాష్ట్రంలోని 37 ఇసుక రీచ్‌లలో దందా కొనసాగిస్తున్నదని సీపీ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ వే బిల్లుల దందా కొనసాగిందని ఆయన పేర్కొన్నారు. విచారణ ప్రాథమిక దశలో ఉందని వారం పదిరోజుల్లో ఈ ముఠాకు సంబంధించిన అన్ని వ్యవహారాలను వెలికి తీస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మట్టెవాడ, టాస్క్‌ఫోర్స్ పోలీసులను సీపీ అభినందించారు. విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ బారీ, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ జనార్ధన్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లులను సీపీ అభినందించారు.

నడుస్తున్న ఆటోపై విరిగిపడిన చెట్టు


ఆటోపై పడిన చెట్టు


ఆస్పత్రిలో చికిత్స చేస్తున్న వైద్యులు

- ఏడుగురికి గాయాలు
- ఆస్పత్రికి తరలింపు

ఏటూరునాగారం: కూలీలు, విద్యార్థులతో వెళ్తున్న ఆటోపై రోడ్డు పక్కనే ఉన్న చెట్టు విరిగిపడి ఏడుగురు గాయపడిన ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని కొండాయికి చెందిన ఆటో డ్రైవర్ బొల్లికొండ శ్రీకాంత్ తన ఆటోలో మల్యాలకు చెందిన పిచ్చి నర్సమ్మ, పాయం జగ్గమ్మ, పాయం సాయన్న, షాపెల్లికి చెందిన విద్యార్థి బీఏ ఫైనలియర్ వావిలాల దుర్గప్రసాద్, కొండాయికి చెందిన దబ్బగట్ల సారక్క, శివరంజితో కొండాయి నుంచి ఏటూరునాగారం వస్తున్నారు. చిన్నబోయినపల్లి - ఏటూరునాగారం మార్గమధ్యలోని వట్టివాగు వద్దకు రాగానే ఎండిపోయి ఉన్న భారీ వృక్షం రాత్రి వర్షం వల్ల నడుస్తున్న ఆటోపై విరిగి పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న పిచ్చి నర్సమ్మకు ఎడమ చేయి, పాయం జగ్గమ్మ ఎడమ భుజానికి, వావిలాల దుర్గ ప్రసాద్‌కు ఎడమకాలుకు తీవ్ర గాయాలుకాగా


గాయపడిన పిచ్చి నర్సక్క

డ్రైవర్ శ్రీకాంత్, శివరంజి, సాయన్న, సారక్కలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి 108లో తరలించి చికిత్సలు అందించారు. చెట్టు ఆటో పై పడడంతో 163 జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయింది. ఆటోపై పడిన చెట్టును గ్రామస్తులు, ప్రయాణికుల సాయంతో తొలగించి క్షతగాత్రులను కాపాడారు. ఆటో నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ లబోదిబోమంటున్నారు.

ఆలయంలో నాలుగుసార్లు చోరీ

- సిద్ధేశ్వరాలయంలో తరచూ దొంగతనాలు
- అయినా మారని తీరు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సంపత్‌రావు

చెన్నారావుపేట: అది మండల కేంద్రంలోని ఆలయం.. తరచూ చుట్టూ జనాలు సంచరిస్తూనే ఉంటారు.. అయినా.. ఆ ఆలయంలో తరచూ దొంగతనాలు జరుగుతుండడం గమనార్హం. ఇప్పటికే ఆలయంలో నాలుగుసార్లు దొంగతనం జరగడం చూస్తుంటే.. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. సిద్ధేశ్వరాలయం పూజరులు సోమవారం రోజువారీ పూజలు చేయడానికి ఆలయం చేరుకున్నారు. గుడి వద్దకు రాగా తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి, విషయాన్ని ఆలయకమిటీ చైర్మన్ కంది గోపాల్‌రెడ్డితో పాటు పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి ఏసీపీ సంపత్‌రావు, సీఐ హతిరామ్, ఎస్సై తోట మహేందర్‌లు చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తాళాలు పగులగొట్టి, హుండీని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. అయితే హుండీలో సుమారుగా రూ.50వేల వరకు ఉన్న నగదు ఉంటుందని అర్చకులు, పోలీసులు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. పోలీస్ స్టేషన్ సమీపంలోని పొలాల్లో హుండీలు పడేయడం గమనార్హం.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి

- ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ శేషు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శేషు


హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేషు మాట్లాడారు. వ్యక్తులు చేసిన తప్పులు వ్యవస్థకు అపాదించడం సరైంది కాదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని విమర్శించారు. వ్యక్తులు వ్యవస్థల భాగమేనని గుర్తించాలన్నారు. టీఎస్పీఎస్సీలో జరిగిన తప్పిదాల నుంచి ప్రభుత్వం తప్పించుకోవాలనుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లోను అప్రతిష్ఠ మూటగట్టుకున్న ఏపీపీఎస్సీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో ఏర్పాటైన టీఎస్పీఎస్సీ కూడా అదే దారితో నడుస్తుందని ధ్వజమెత్తారు. ప్రశ్నాపత్రాల లీక్, ప్రశ్నాపత్రాల్లో తప్పులు, భర్తీ ప్రక్రియలో జాప్యం వంటి అనేక తప్పిదాలతో టీఎస్పీఎస్సీ నిరుద్యోగుల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. ఈ క్రమంలో టీఎస్పీఎస్సీని సమూలంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్, మెయిల్ ద్వారా ప్రక్షాళనకు చెందిన సూచనలను ఇప్పటికే పంపామని, లేఖ ద్వారా పంపనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా వేదిక నాయకులు సతీష్, చిన్నాల యశ్వంత్ యాదవ్, అజయ్, నరేందర్, దానేశ్వర్, జితేందర్, కిరణ్, బోస్ పాల్గొన్నారు.

తెలంగాణకు రెండో బహుమతి


బహుమతితో జీవిత

వరంగల్(పర్వతగిరి): జైపూర్‌లో గత మూడు రోజులుగా నిర్వహించిన స్క్వాష్ రాకెట్ పోటీలకుగాను తెలంగాణకు రెండో బహుమతి లభించింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఇస్లావత్‌తండాకు చెందిన జీవిత పోటీల్లో నైపుణ్యం సాధించి రెండో బహుమతికి దోహదపడింది. దేశవ్యాప్తంగా పది టీంలు పాల్గొనగా మొదటి బహుమతి మహారాష్ట్ర దక్కించుకోగా, రెండో బహుమతి తెలంగాణ కైవసం చేసుకుంది. గతంలో అథ్లెటిక్ పోటీల్లో జాతీయ స్థాయిలో.. ప్రస్తుతం స్క్వాష్ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించడం గర్వంగా ఉందని ఆమె తెలిపారు.

మావోయిస్టు సానుభూతిపరుల అరెస్ట్


అరెస్ట్ చూపుతున్న ఎస్పీ గాష్ ఆలం

ములుగు: మావోయిస్టులకు సహకరిస్తేశాఖపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ములుగు ఎస్పీ గాష్ ఆలం హెచ్చరించారు. ఈ మేరకు అనుమానితంగా పేలుడు పదార్థాలను తరలిస్తున్న ఎనిమిది మంది నిషేధిత సీపీఐ మావోయిస్టు సానుభూతిపరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని పోలీసు సాయుధ కార్యాలయంలో ఎస్పీ గాష్ ఆలం విలేకరుల సమావేశంలో అరెస్ట్ చూపించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో వెంకటాపురం(కె) మండలం రామచంద్రాపురం శివారులో కొంతమంది కారు, ద్విచక్రవాహనంపై అనుమానస్పదంగా ప్రయాణిస్తున్నారని తెలుసుకున్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వారిని వెంబడించారు. కారు, ద్విచక్రవాహనాన్ని వెంబడించి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వాహనంలోని పేలుడు పదార్థాలు, ఐఈడీ మెటీరియల్‌లోని తోహభాగాలు, విప్లవ, సాహిత్య పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో మావోయిస్టు అగ్రనేత దామోధర్, చంద్రన్నతో కలిసి , మరికొంత మంది సభ్యులు భూ సమస్యలను పరిష్కరించడానికి చేస్తున్న విప్లవ భావజాలానికి ఆకర్షితులయ్యారు. దామోదర్ సూచనల మేరకు కూంబింగ్ ఆపరేషన్ల కోసం అడవికి వచ్చే పోలీసులను చంపాలనే ఉద్దేశంతో పేలుడు పదార్థాలను తరలిస్తూ కనిపించారు. పట్టుబడిన వారిని విచారించగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాగారం గ్రామానికి చెందిన అంది రవి, వరంగల్ జిల్లా సంగెం మండలం పల్లారుగూడ గ్రామానికి చెందిన శ్రీరామోజు మనోజ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన దిడ్డి సత్యం, సంగెం మండలానికి చెందిన శ్రీరామోజు భిక్షపతి, మల్హర్ మండలం పెద్దతండా గ్రామానికి చెందిన అనసూరి రాంబాబు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాప్రా మండలానికి చెందిన గణపురం చంద్రమౌళి, కాప్రా మండలానికి చెందిన పృథ్వీరాజ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నాగారానికి చెందిన అంది మానసగా తెలిసింది. నిందితులు అందరిపై కేసులు ఉన్నట్లుగా ఎస్పీ తెలిపారు. వారి నుంచి ఐఈడీఎస్–45 యొక్క ఇనుప భాగాలు, 10 మీటర్ల కార్డెక్స్ వైర్, రెండు డిటోనేటర్లు, ఒక బ్యాటరీ, నాలుగు విప్లవ సాహిత్యాలు, మధుమేహం, ఇతర అనారోగ్య సమస్యలకు సంబంధించిన మాత్రలు, కారు బేరింగ్, హోండా మోటార్ ద్విచక్రవాహన బేరింగ్, ఎనిమిది మొబైల్ ఫోన్లు, రూ. 4140 నగదు పట్టుబడినట్లు తెలిపారు. సంఘటన ఆధారంగా వెంకటాపురం(కె) పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశామని అన్నారు. సమావేశంలో ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, వెంకటాపురం(కె) సీఐ శివప్రసాద్, ఎస్సై తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆబ్కారీ చేతివాటం

- పట్టుకున్న నల్లబెల్లం అమ్మకానికి తరలింపు
- గుట్టు రట్టు చేసిన మరిపెడ పోలీసులు
- సోషల్ మీడియాలో వైరల్


పట్టుబడిన తొర్రూరు ఎక్సైజ్ బెల్లం వాహనం

మరిపెడ రూరల్: అక్రమ వ్యాపారాలు ఆట కట్టించే ఆబ్కారీ పోలీసులు చేతివాటం ప్రదర్శించారు. ఓ వేలం వేసిన వాహనంలో అక్రమంగా నల్ల బెల్లం తరలించి అమ్మడానికి డంపు చేస్తుండగా మరిపెడ పోలీసులు పట్టుకుని గుట్టురట్టు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఎక్సైజ్ పరిధిలో అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న పలు వాహనాలను ఆబ్కారి ఆధ్వర్యంలో ఇటీవల వేలం వేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు వేలం పాటలో వాహనాలు దక్కించుకున్నారు. ఈ ఇదే అదునుగా భావించిన ఎక్సైజ్ అధికారులు చేతి వాటం ప్రదర్శించారు. అనుకూలంగా ఉన్న ఓ బెల్లం బస్తాల లోడ్ వాహనాన్ని అర్ధరాత్రి అక్రమంగా తరలించారు. మరిపెడ మండలంలోని యలమంచిలితండాలో శివారులో డంప్ చేస్తున్నారు. తండా వాసుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న మరిపెడ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి సదరు వాహనాన్ని పట్టుకొని మరిపెడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో డ్రైవర్ విచారించడంతో అసలు విషయం బయటకు పొక్కింది. వెంటనే మేల్కొన్న అబ్కారీ అధికారి తమ ఆధీనం నుంచే బెల్లం లోడ్ వాహనం అటు వైపుగా వచ్చిందని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చి వాహనాన్ని తొర్రూరు తీసుకెళ్లారు. కంచె చేను మేసిన చందంగా తొర్రూరు ఎక్సైజ్ పోలీసుల తీరు ఉందని ప్రజలు అవాక్కవుతున్నారు. ఈ వ్యవహారమంతా సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం గమనార్హం. ఈ విషయంపై తొర్రూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా. వేలం వేసిన వాహనం విజయవాడకు వెలుతుంది. తమ తప్పిదం వల్ల బెల్లం బస్తాలు అందులోనే ఉండిపోవడంతో మరిపెడ పోలీసులు పట్టుకొని సమాచారం ఇచ్చినట్లు సదరు అధికారి పేర్కొన్నారు.

ఆన్‌లైన్ మాయ

కాజీపేట: కాజీపేట పట్టణానికి చెందిన ఓ యువతి ఆన్‌లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తుల మాటలు నమ్మి రూ.30వేలు నష్టపోయింది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేటకు చెందిన యువతి ఓఎల్ఎక్స్ అప్లికేషన్స్ పరిశీలిస్తుండగా అందులో ఒక పల్సర్ బైక్ అమ్మకానికి ఉండగా కింద ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి బేరం కుదుర్చుకుంది. జీఎస్టీ, ట్రాన్స్‌ఫోర్ట్ ఛార్జీల కింద మోసగాళ్లు చెప్పినట్లుగా డబ్బులను చెల్లించింది. ఆ తర్వాత అటువైపు నుంచి సమాధానం లేకపోవడంతో మోసపోయినట్లుగా గుర్తించి ఫిర్యాదు చేయగా విచారణ జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్టు


గంజాయిని పరిశీలిస్తున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం : ఎండు గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు, సరఫరాకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను మిల్స్‌కాలనీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ తెలిపారు. సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీ రంగనాథ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, ఒడిషా రాష్ట్రాల నుంచి భద్రాచలం మీదుగా వరంగల్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని కమ్మంపాటి సుమంత్, పాకాల సాయికుమార్, ములుగు వికాస్ అలియాస్ విక్కీలను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.60 వేల విలువగల మూడు కిలోల ఎండు గంజాయి, 2 సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు శివనగర్‌కు చెందిన కమ్మంపాటి సుమంత్ కరీంనగర్‌లో కొబ్బరి బోండాల వ్యాపారం చేసుకుంటూ ఎవరికి అనుమానం రాకుండా గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడేవాడని తెలిపారు. సుమంత్ స్నేహితులైన పాకాల సాయికుమార్, ములుగు వికాస్‌లు ఎవరికి అనుమానం రాకుండా వరంగల్, మహబూబాబాద్ మీదుగా భద్రాచలం నుంచి ఒడిషాలోని కలిమెలకు ద్విచక్ర వాహనం పై చేరుకొని అక్కడ మొద్దు అలియాస్ భాయ్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి తిరిగి వరంగల్‌కు చేరుకొని 100 గ్రాముల గంజాయిని రూ.500, రూ.700, రూ.1000 చొప్పున అమ్మే వారని తెలిపారు. వరంగల్‌లోని శివనగర్, కాశిబుగ్గ, కరీమాబాద్, ఖిలా వరంగల్, చింతల్, లేబర్‌కాలనీ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు చేపట్టినట్లు సీపీ తెలిపారు. కొంతమంది పాఠశాల, కళాశాల విద్యార్థులకు గంజాయిని అలవాటు చేసి వారి ద్వారా గంజాయి విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. 15 మంది గంజాయి విక్రయదారులు, 50 మంది వినియోగదారులను ఆదివారం రాత్రి ఖిలా వరంగల్‌లోని రాతికొండ దగ్గరకు వస్తున్నారనే సమాచారంతో వెళ్లగా ముగ్గురు నిందితులు పట్టుబడినట్లు తెలిపారు. ఇప్పటి వరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు 13 మంది గంజాయి అమ్మకందారులను అదుపులోకి విచారిస్తున్నట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు గంజాయి సేవించే వారిని 159 మందిని గుర్తించి కమిషనరేట్‌లోని ఆరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 14 మందిని జైలుకు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. గంజాయి స్మగ్లర్లను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ డాక్టర్ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రావు, ఎస్సైలు వడ్డెబోయిన లవణ్‌కుమార్, నిస్సార్ పాషా, కానిస్టేబుళ్లు రాజేష్, రాజు, బిక్షపతి, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, నవీన్‌లను సీపీ నగదు రివార్డులతో అభినందించారు.

నల్లబెల్లం స్వాధీనం.. కేసు నమోదు


మరిపెడలో పట్టుబడిన బెల్లం లోడ్ నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మరిపెడ రూరల్: అక్రమంగా రవాణ చేస్తున్న 21 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుకున్నట్లు వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై మధు సోమవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం స్టేజి నుంచి వయా విస్సంపల్లి, ఎల్లంపేట మీదుగా సోమ్లతండాకు ఓ వాహనంలో బెల్లం తరలిస్తున్నట్లు సమాచారం మేరకు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 42 బస్తాల్లోని 21 క్వింటాళ్ల నల్ల బెల్లాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి సోమ్లతండాకు చెందిన గుగులోతు నవీన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాకు చెందిన పుల్లారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడుల్లో సత్యప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రావణ్, మధార్ పాల్గొన్నారు.